మాతృభాషను పరిరక్షించాలి

- అమ్మను, మాతృభాషను మరవొద్దని విద్యార్థులకు ఉపాధ్యాయుల సూచన



బీర్కూర్‌లో మాతృభాష గురించి విద్యార్థులకు వివరిస్తున్న ఉపాధ్యాయులు

నస్రుల్లాబాద్(బీర్కూర్): బీర్కూర్ మహాత్మ జ్యోతి బాపులే పాఠశాలలో మంగళవారం అంతర్జాతీయ మాతృబాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తెలుగు తల్లి చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. విద్యార్థులకు ఆటల పోటీలు నిర్వహించారు.

డిగ్రీ కళాశాలలో..

బాన్సువాడ రూరల్: మండలంలోని శ్రీరాం నారాయణ ప్రభుత్వ డిగ్రీ కళాశాలతో పాటు పలు ప్రభుత్వ పాఠశాలల్లో మాతృ భాష ప్రాధాన్యతను అధ్యాపకులు వివరించారు. అమ్మను, మాతృ భాషను మర్చిపోకూడదని ఈ సందర్భంగా సూచించారు. మాతృభాషను పరిరక్షించుకోవడం అందరి బాధ్యత అని ఎస్ఆర్ఎన్‌కే ప్రభుత్వ డిగ్రీకళాశాల ప్రిన్సిపల్ గంగాధర్ అన్నారు. అధ్యాపకులు విఠల్, వెంకట్రావ్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు రమాదేవి, శ్రీనివాస్, రాజేష్, కృష్ణ,శేఖర్ పాల్గొన్నారు.

సదాశివనగర్: మండలంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ రాధిక మాట్లాడుతూ మాతృ భాష పరిరక్షణకు తీసుకోవాల్సిన చర్యల గురించి వివరించారు. తెలుగుతల్లి, సి.నారాయణ రెడ్డి, దాశరథి చిత్ర పటాలకు పూలమాలలు వేసి, అనంతరం వారి గొప్పతనాన్ని వివరించారు. వైస్ ప్రిన్సిపల్ మాణిక్యరేఖ పాల్గొన్నారు.

లింగంపేట: మాతృభాషతోనే మానవ జాతికి వికాసం ఉంటుందని ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి అన్నారు. మంగళవారం ఆయన శెట్పల్లి సంగారెడ్డి ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన మాతృభాష దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ పిల్లలకు సంపూర్ణ అభివృద్ధి మాతృభాషతోనే జరుగుతుందని పేర్కొన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం



గండిమాసానిపేటలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి

లింగంపేట: రాబోయే ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయం అని మాజీ ఎమ్మెల్యే రవీందర్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం మండలంలోని బాణాపూర్‌లో ఏర్పాటు చేసిన ప్రజా గోస బీజేపీ భరోసా యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం అయ్యారన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పథకాలను కేసీఆర్ తన ఖాతాల్లో వేసుకుంటున్నారని విమర్శించారు. కేసీఆర్ వైఫల్యాలను ప్రజలకు వివరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు దత్తురాం, ఎల్లమయ్య, రాంచందర్, సాయన్న, దూరిశెట్టి అశోక్, ఉదేష్, లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.

కేంద్ర పథకాలను వివరించాలి

ఎల్లారెడ్డి: కేంద్ర ప్రభుత్వ పథకాలను ఇంటింటా వెళ్లి వివరించాలని మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్‌రెడ్డి బీజేపీ కార్యకర్తలకు సూచించారు. మంగళవారం గండిమాసానిపేట గ్రామంలో ఎల్లారెడ్డి, కొత్తపల్లి, గండిమాసానిపేట పోలింగ్ బూత్ పరిధిలోని బీజేపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నాయకులు ఎస్ఎన్‌రెడ్డి, బాలకిషన్, బాలకిషన్, సామెల్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

కేసీఆర్ పాలనలో వ్యవస్థలన్నీ నిర్వీర్యం



మాట్లాడుతున్న బీజేపీ నాయకుడు మురళీధర్‌గౌడ్

కామారెడ్డి టౌన్ : సీఎం కేసీఆర్ తొమ్మిదేళ్ల పాలనలో రాష్ట్రంలోని అన్ని వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని వరంగల్ బీజేపీ ఇంచార్జి డాక్టర్ ఉప్పునూతల మురళీధర్ గౌడ్ ఆరోపించారు. కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లిలో మంగళవారం నిర్వహించిన ప్రజా గోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ అబద్ధపు హామీలతో ప్రజలను మోసం చేస్తున్నారన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు ఎంజీ వేణుగోపాల్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు రెండు ఒకటే అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు నీలం చిన్న రాజులు, రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు తుమ్మ బాలకిషన్, కాసర్ల రాజలింగం, చిన్నోల రజినీకాంత్ రావు, ఓబీసీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కడెం శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ధరణి సమస్యలు పరిష్కరించాలి..

భిక్కనూరు: రైతులకు సంబంధించిన ధరణి సమస్యలు పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని బీజేపీ మండల అధ్యక్షుడు రెడ్డిగారి రమేషురెడ్డి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యలు పరిష్కరించాలని ఐదు నెలల కిందట వినతి పత్రం అందజేసినా రెవెన్యూ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. తహసీల్దార్ ప్రేమ్‌కుమార్ కార్యాలయంలో అందుబాటులో లేకపోవడంతో సూపరింటెండెంట్ నరేందర్ రెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షుడు నర్సింలు, నాయకులు యాదగిరగౌడ్, నరేందర్‌రెడ్డి, ఎక్‌నాథ్, బాల్‌లింగం, రవిందర్‌రెడ్డి, రాకేషు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి వస్తే అర్హులందరికీ ఇళ్లు



అక్కాపూర్‌లో మాట్లాడుతున్న షబ్బీర్ అలీ

మాచారెడ్డి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే అర్హులందరికీ పక్కా ఇళ్లు నిర్మిస్తామని మాజీ మంత్రి, ఏఐసీసీ సభ్యుడు షబ్బీర్‌అలీ అన్నారు. మంగళవారం మండలంలోని తడ్కపల్లి, అక్కాపూర్, కొత్తపల్లె, లక్ష్మిరావులపల్లి, చుక్కాపూర్ గ్రామాల్లో నిర్వహించిన హాథ్ సే హాథ్ జోడో యాత్ర నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా మీడియా, రాజకీయ నేతలు మాట్లాడితే ఈడీ, ఐటీ దాడులతో బెదిరిస్తున్నారని ఆరోపించారు. ఇంధనం, నిత్యావసర ధరలు భారీగా పెంచడంతో పేదల జీవితాలు దుర్భరంగా మారాయన్నారు. డీసీసీ అధ్యక్షుడు కైలాస్ శ్రీనివాస్‌రావ్, మండల అధ్యక్షుడు గణేశ్‌నాయక్, నాయకులు పొన్నాల లక్ష్మారెడ్డి, నౌసీలాల్, బీంరెడ్డి, శివ, కృష్ణమూర్తి, సందీప్, పల్లె రమేశ్‌గౌడ్, శ్రీనివాస్‌యాదవ్, జ్యోతి, నర్సాగౌడ్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌తో అన్ని వర్గాలకు ప్రయోజనం

గాంధారి: కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని ఆ పార్టీ ఎల్లారెడ్డి నియోజకవర్గం ఇన్‌చార్జి సుభాష్ రెడ్డి అన్నారు. హాథ్ సే హాథ్ జోడో యాత్రలో భాగంగా ఆయన గాంధారిలో ఇంటింట వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట ఎంపీటీసీ కామెల్లి బాల్‌రాజు, నాయకులు లైన్ రమేష్, మధార్ తదితరులున్నారు.

వాటర్ ప్లాంట్ ప్రారంభం



కామారెడ్డి రూరల్: మున్సిపల్ పరిధిలోని ఆరో వార్డు పాత రాజంపేటలో బాల వికాస సంస్థ నిర్మించిన వాటర్ ప్లాంట్‌ను కౌన్సిలర్ ఆకుల రూప రవి కుమార్ మంగళవారం ప్రారంభించారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోపి గౌడ్, బాలవికాస సీనియర్ మేనేజర్ ప్రతాప్ రెడ్డి, ఏబీఎం మామిండ్ల కుమార్, సొసైటీ డైరెక్టర్ రాజు, కౌన్సిలర్లు భాస్కర్ గౌడు, కాళ్ల గణేష్, ప్రసన్న కుమార్, పాదర్లా రాజు తదితరులు పాల్గొన్నారు.

అసైన్డ్ భూములను పంపిణీ చేయాలి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి

గాంధారి: అసైన్డ్ భూములను పేదలకు పంపిణీ చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వెంకట్ గౌడ్ డిమాండ్ చేశారు. మండలంలోని మాతుసంగెంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ గ్రామంలో భూములున్న కొందరు రాజకీయ అండదండలతో అసైన్డ్ భూములను ఆక్రమించుకొని, బోగస్ పట్టాలు చేయించుకున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు మోతిరాం నాయక్, భీమ్‌సింగ్, లక్ష్మీబాయి, మల్లేష్, రాంసింగ్, చింటు, దేవిసింగ్, సాయిలు తదితరులు పాల్గొన్నారు.

సామాజిక అంశాలపై ప్రణాళిక



మాట్లాడుతున్న ఐకేపీ అధికారి రామచంద్రగౌడ్

దోమకొండ: సామాజిక అంశాలు నేరవేర్చే క్రమంలో ప్రతి గ్రామ సంఘం ప్రణాళిక తయారు చేసుకోవాలని ఐకేపీ జిల్లా అధికారి రామచంద్రగౌడ్ అన్నారు. మంగళవారం స్థానిక ఐకేపీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంస్థాగత నిర్మాణం, ఆర్థిక అభివృద్ధి, జీవనోపాదులు, ఆరోగ్యం, పోషణ, మౌలిక వసతులు తదితర విషయాలపై వివరించారు. జిల్లాలో దోమకొండ మండలాన్ని మోడల్‌గా ఎంచుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఐకేపీ ఏపీఎం రాజు, సీసీ రమేష్, రాజేశం, శ్రీనివాస్, రామకృష్ణ పాల్గొన్నారు.

గ్రంథాలయ భవన పనుల పరిశీలన



గ్రంథాలయ భవనాన్ని పరిశీలిస్తున్న జెడ్పీ వైస్ చైర్మన్ ప్రేమ్‌కుమార్

బీబీపేట: మండల కేంద్రమైన బీబీపేటలో నిర్మిస్తున్న గ్రంథాలయ భవనాన్ని మంగళవారం జెడ్పీ వైస్ చైర్మెన్ ప్రేమ్‌కుమార్ పరిశీలించారు. చేపట్టాల్సిన వసతులు, ఫర్నీచర్ తదితర వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. త్వరలో ప్రారంభిస్తామని తెలిపారు.

మొక్కలు ఎండిపోతే ఎలా?



బాన్సువాడ రూరల్: మండలంలోని బోర్లం క్యాంపులో హరితహారం నర్సరీలో మొక్కలు ఎండిపోతుండటంతో ఎంపీపీ నీరజారెడ్డి సిబ్బంది పని తీరుపై అసహనం వ్యక్తం చేశారు. మొక్కలకు నీరు పట్టకపోతే అవి ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. ఆమె వెంట కార్యక్రమంలో ఎంపీడీవో సత్యనారాయణరెడ్డి తదితరులు ఉన్నారు.

యూరియా తక్కువ వాడాలి



చిల్లర్గిలో వరిని పరిశీలిస్తున్న డీఏవో భాగ్యలక్ష్మి

పిట్లం: వరి పంటకు యూరియా తక్కువ వాడాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారిణి భాగ్యలక్ష్మి సూచించారు. మండలంలోని చిల్లర్గిలో మంగళవారం ఆమె వరి పంటను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. వరికి సోకికన మొగి పురుగు, అగ్గి తెగులు నివారణకు వ్యవసాయ శాఖ అధికారులు సిఫార్సు చేసిన మందులు వాడాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారిణి కావేరి, సర్పంచ్ రమేష్, ముల్తానీ, సాయిలు, వీఆర్ఏలు సత్యం, సాయిలు, అర్జున్, హన్మండ్లు తదితరులు పాల్గొన్నారు.

అగ్గి తెగులుతో జాగ్రత్త

నాగిరెడ్డిపేట: వరికి ఆశించిన అగ్గి తెగులు నివారణకు రైతులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి విజయశేఖర్ సూచించారు. మండలంలోని రాఘవపల్లి తండా, మెల్లకుంట తండాలో సాగు చేసిన వరి పంటలను పరిశీలించారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం



ముగ్దుంపూర్‌లో పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్

పెద్దకొడప్‌గల్: గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయమని ఎంపీపీ ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని వడ్లం గ్రామంలో సిమెంట్ రోడ్డు పనులను ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావు, ఉప సర్పంచ్ పండరి పాల్గొన్నారు.

నిజాంసాగర్: మండలంలోని ముగ్దుంపూర్ పంచాయతీలోని బోయిగల్లి, ఎస్టీ కాలనీలో సిమెంట్ రోడ్డు పనులను సర్పంచ్ లక్ష్మినారాయణ ప్రారంభించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు విఠల్‌గౌడ్, బానుప్రసాద్ పాల్గొన్నారు.

పిట్లం: మండలంలోని చిన్నకొడపగల్ బీసీ కాలనీలో సర్పంచ్ కవితారెడ్డి సీసీ రోడ్ల పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరికెల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు విజయ్, వెంకటరామిరెడ్డి, నారాయణ, శశికాంత్ పాల్గొన్నారు.

దోమకొండ: మండల కేంద్రమైన దోమకొండలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. దోమకొండకు రూ.కోటి నిధులు మంజూరైనట్లు వారు తెలిపారు. సర్పంచ్ నల్లపు అంజలి, ఉపసర్పంచ్ గజవాడ శ్రీకాంత్, సింగిల్‌విండో చైర్మన్ పన్యాల నాగరాజ్‌రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు గంగ్ర మధుసూధన్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందివ్వాలి



బోర్లం క్యాంపులో అంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎంపీపీ నీరజారెడ్డి

బాన్సువాడ రూరల్: చిన్నారులు, గర్భిణులు, బాలింతల కోసం ప్రభుత్వం సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని సకాలంలో అందివ్వాలని ఎంపీపీ నీరజారెడ్డి అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. మండలంలోని బోర్లం క్యాంపుతండా, చిన్న రాంపూర్ గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాలను మంగళవారం తనిఖీ చేశారు. అనంతరం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలను సందర్శించి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు బోనాల సుభాష్, పీర్యానాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

- కోటదుర్గా దేవి ఉత్సవ విగ్రహ ఊరేగింపులో స్పీకర్



బాన్సువాడ టౌన్: పట్టణంలో మంగళవారం నిర్వహించిన శ్రీశ్రీశ్రీ కోటదుర్గా దేవి ఉత్సవ విగ్రహ ఊరేగింపు అంగరంగ వైభవంగా నిర్వహించారు. భవానిమాత దీక్ష స్వాముల ఆధ్వర్యంలో కళాకారులు నృత్యాలు చేస్తూ ర్యాలీ చేపట్టారు. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి కళాకారులు, మహిళలతో కలిసి కోలాటం ఆటలాడారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు పత్తి శ్రీకాంత్, అధ్యక్షుడు ఉప్పరి లింగం, సభ్యులు కాశీనాథ్, మహేందర్ పాల్గొన్నారు.

- బోనాల ఊరేగింపు

మాచారెడ్డి: మండలంలోని గన్‌పూర్(ఎం) గ్రామంలో పెద్దమ్మ తల్లి పండుగ సందర్భంగా ముదిరాజ్ కులస్తులు బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఇంటికో బోనం చొప్పున అమ్మవారికి సమర్పించారు.

- ఘనంగా మస్తాన్‌షా వలి ఉర్సు



లింగంపేట: మండల కేంద్రంలో మంగళవారం మస్తాన్‌షా వలి ఉర్సును ఘనంగా నిర్వహించారు. మమ్మద్ ఖలీమొద్దిన్ ఇంటి నుంచి గంధం, చెద్దరు, పువ్వులు, జెండాతో ఊరేగింపుగా వెళ్లారు. అనంతరం దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఈ కార్యక్రమంలో ముస్లిం పెద్దలు ఫతియొద్దిన్, ఖాసీం, ముస్తాఫా, మన్సూర్‌ఖాన్, ఫారూఖ్, రషీద్, హర్షద్, ఏదుల్, యూసుఫ్, మునీర్, ఆజమ్ తదితరులు పాల్గొన్నారు.

- వైభవంగా రథోత్సవం



నాగిరెడ్డిపేట: మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మండలంలోని తాండూర్‌లో ఉన్న శ్రీ త్రిలింగేశ్వరాలయం వద్ద సోమవారం రాత్రి రథోత్సవం నిర్వహించారు. రథాన్ని మామిడి ఆకుల తోరణాలు, వివిధ రంగుల కాగితాలతో అలంకరించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని రథాన్ని ముందుకు లాగారు. ఆలయ కమిటీ చైర్మన్ దత్తు, ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి పాల్గొన్నారు.

- ప్రారంభమైన అఖండ హరినామ సప్తాహం

మద్నూర్: మండల కేంద్రంలోని సోమలింగాల ఆలయంలో మంగళవారం ఆఖండ హరినామ సప్తాహ కార్యక్రమం ప్రారంభించారు. వారం రోజుల పాటు ఆలయంలో సంకీర్తనలు కొనసాగుతాయని నిర్వాహకులు తెలిపారు.

కార్యవర్గం..

- నాయీ బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం



కామారెడ్డి అర్బన్/కామారెడ్డి టౌన్: జిల్లా నాయీ బ్రాహ్మణ జనశక్తి సేవా సంఘం కార్యవర్గాన్ని మంగళవారం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నందు ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా ఎల్లయ్య, అధ్యక్షుడుగా ఎస్.మహేందర్, ప్రధాన కార్యదర్శిగా రవీందర్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బాలకిషన్, నాందేవ్, సంయుక్త కార్యదర్శులుగా రాజు, భాస్కర్, కోశాధికారిగా బాబు ఎన్నికయ్యారు.

- టిటా జిల్లా కార్యదర్శి నియామకం

కామారెడ్డి టౌన్: తెలంగాణ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ అసోసియేషన్ (టిటా) జిల్లా కార్యదర్శిగా కామారెడ్డికి చెందిన చెల్లపురం శ్రీకాంత్‌ను నియమించారు.

- ముదిరాజ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడి నియామకం



కామారెడ్డి అర్బన్: జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పున్నా రాజేశ్వర్ ముదిరాజ్ మహాసభ తెలంగాణ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమితులయ్యారు. మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర అధ్యక్షుడు బండ ప్రకాష్ ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో ముదిరాజ్ మహాసభ కమిటీలను నియమించి కార్యక్రమాలను నిర్వహిస్తానని ఆయన తెలిపారు.

క్లుప్తంగా

శ్మశాన వాటికలో బోరు తవ్వకం

నిజాంసాగర్: మండలంలోని తున్కిపల్లి గ్రామ మైనార్టీ శ్మశాన వాటికలో మంగళవారం బోరు బావి తవ్వకం పనులను బీఆర్ఎస్ నాయకులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగాల రాంచెందర్, పుప్పాల విఠల్, అమీర్, సాయిలు, రవి, రషీద్, శ్రీనివాస్, అరవింద్ త దితరులు పాల్గొన్నారు.

స్మితా సబర్వాల్‌ను కలిసిన టీఎన్‌జీవోస్ నేతలు



కామారెడ్డి అర్బన్: ముఖ్యమంత్రి కార్యాలయ ప్రత్యేక అధికారిణి స్మిత సబర్వాల్ మంగళవారం కామారెడ్డి జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కలెక్టరేట్‌లో టీఎన్‌జీవోస్ సంఘం నాయకులు మర్యాద పూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నరాల వెంకట్‌రెడ్డి, బి.సాయిలు, ఉమ్మడి జిల్లాల సమన్వయకర్త శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

సర్పంచ్‌కు సన్మానం



మాచారెడ్డి: మండలంలోని భవానీపేట సర్పంచ్ మద్దెల రాజు, ఉపసర్పంచ్ రమేశ్‌గౌడ్‌లను స్థానికులు మంగళవారం సన్మానించారు. భవానీపేట గ్రామ పంచాయతీ రెండో సారి జాతీయ కార్యశాలకు ఎంపిక కావడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ, కార్యశాలకు వెళ్లి వచ్చిన సర్పంచ్‌కు ఘన స్వాగతం పలికారు.

క్రీడా ప్రాంగణంతో ఎంతో ఉపయోగం




నాగిరెడ్డిపేట: మండలంలోని రాఘవపల్లిలో మంగళవారం క్రీడాప్రాంగణాన్ని ఎంపీపీ రాజ్‌దాస్, జెడ్పీటీసీ మనోహర్‌రెడ్డి సర్పంచ్ వెంకట్రాంరెడ్డితో కలిసి ప్రారంభించారు. గ్రామంలోని యువకులు క్రీడా ప్రాంగణాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రఘు, పంచాయితీ కార్యర్శి క్రిష్ణమూర్తి, సిబ్బంది సాయిలు, సంతోష్, మల్లమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఆర్మీకి ఎంపికైన యువకుడికి సన్మానం



రామారెడ్డి: రామారెడ్డి మండలంలోని పోసానిపేట గ్రామానికి చెందిన వంశీ ఆర్మీకి ఎంపికైన సందర్భంగా శివాజీ సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం సన్మానించారు. ఆర్మీలో చేరేందుకు యువత ముందుకు రావాలని సర్పంచ్ గీరెడ్డి మహేందర్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్లు అంజయ్య, బండి, రాజశేఖర్, శివాజీ సేవసమితి,సభ్యులు భాస్కర్‌రెడ్డి, నరేష్ అశోక్ పాల్గొన్నారు.

రసవత్తరంగా కుస్తీ పోటీలు



ఎల్లారెడ్డిరూరల్: మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో మంగళవారం నిర్వహించిన కుస్తీ పోటీలు రసవత్తరంగా సాగాయి. ఎల్లారెడ్డి, పిట్లం, జుక్కల్, నిజాంసాగర్ తదితర మండలాలకు చెందిన వల్లయోధులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ దామోదర్, నాయకులు అరవింద్, రవీందర్ పాల్గొన్నారు.

కూలీలకు పనులు కల్పిస్తాం

మద్నూర్: ఉపాధి హామీ పథకం కూలీలకు పనులు కల్పించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు సర్పంచ్ సూర్యకాంత్ పేర్కొన్నారు. స్థానిక పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామి పథకం సామాజిక తనిఖీ గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ విఠల్, పంచాయతీ కార్యదర్శి సందీప్, ఉపాధి హామీ ఏపీవో పద్మ పాల్గొన్నారు.

న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

దోమకొండ: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో మంగళవారం గర్భిణులకు న్యూట్రిషన్ కిట్లను జెడ్పీటీసీ సభ్యుడు తీగల తిర్మల్‌గౌడ్, ఇతర ప్రజా ప్రతినిధులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కానుగంటి శారద, వైస్ ఎంపీపీ బాపురెడ్డి, సర్పంచ్ నల్లపు అంజలి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

ఇళ్ల కోసం 24 నుంచి రిలే దీక్షలు

కామారెడ్డి టౌన్: నిరు పేదలకు డబుల్ బెడ్రూం ఇళ్లు అందజేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 24 25 తేదీల్లో స్థానిక మున్సిపల్ కార్యాలయం ముందు రిలే నిరాహార దీక్షలు చేపడుతున్నట్లు బీఎల్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్. సిద్దిరాములు తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం, ఎమ్మెల్యే స్పందించి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఆంజనేయులు, సదానందం, వడ్ల సాయికృష్ణ, గంగమణి, గోదావరి పాల్గొన్నారు.

పీఆర్‌సీ అమలు చేయాలి

కామారెడ్డి టౌన్: పెండింగ్‌లో ఉన్న పీఆర్‌సీ వెంటనే అమలు చేయాలని కామారెడి విద్యుత్ ఉద్యోగుల సంఘం జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. డిమాండ్లు పరిష్కరించే వరకు ఉద్యమం ఆపేది లేదన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు సంపత్‌రెడ్డి, బ్రహ్మం, వెంకటేష్, మన్నే శ్రీరాములు, రమేష్ గౌడ్, మెహర్‌బాబా తదితరులున్నారు.

పశువులకు చికిత్స

కామారెడ్డి రూరల్: మండలంలోని ఉగ్రవాయి గ్రామంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత పశువైద్య శిబిరంలో పశువులకు పలు రకాల చికిత్సలు అందించారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పిప్పిరి వెంకటి, వైస్ చైర్మన్ కుంభాల రవి యాదవ్, సర్పంచ్ సుమిత జనార్దన్ రెడ్డి పాల్గొన్నారు.

రేపు బాన్సువాడలో సేవాలాల్ జయంతి

బాన్సువాడ టౌన్: సేవాలాల్ జయంతి వేడుకలను గురువారం బాన్సువాడలో నిర్వహించనున్నట్లు బంజార సేవా సంఘం నాయకులు మోహన్‌నాయక్ తెలిపారు. కార్యక్రమానికి స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి తదితరులు హాజరవుతారని పేర్కొన్నారు. సమావేశంలో బంజార సేవా సంఘం నాయకులు బన్సీలాల్, భాస్కర్, చందర్, బల్‌రాంనాయక్ ఉన్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

పెద్దకొడప్‌గల్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీపీ ప్రతాప్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వడ్లం జెడ్పీ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఆయన పరిశీలించారు. ఆయన వెంట బిచ్కుంద మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఖండేరావు, పాఠశాల హెచ్ఎం రామాంజనేయులు ఉన్నారు.

బీఎస్పీ నేతను అదుపులోకి తీసుకున్న పోలీసులు

భిక్కనూరు: మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో సీఎంవో కార్యదర్శి స్మితా సబర్వాల్ గర్భిణులతో నిర్వహించిన సమావేశాన్ని అడ్డుకున్నాడనే కారణంతో బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీధర్‌రెడ్డిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

ఎమ్మెల్సీ అభ్యర్థిని కలిసిన నాయకులు

కామారెడ్డి టౌన్: గవర్నర్ కోటాలో ఏపీలో వైఎస్సార్‌సీపీ తరపును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేసిన కర్రి పద్మశ్రీని మంగళవారం విజయవాడలో జిల్లాకు చెందిన ఎస్ఏఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పాక రవిప్రసాద్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

పిట్లం: పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలని పిట్లం పంచాయతీ కార్యదర్శి యాదగిరి కోరారు. సిబ్బందితో కలిసి ఆయన ఇంటింట తిరిగి పన్నులు వసూలు చేశారు.